

# నేడు టీటీడీ పాలకమండలి సమావేశం

ప్రజాశక్తి –తిరుమల

చైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన అన్నమయ్య భవనంలో ఉదయం 10.30 గంటలకు పాలక మండలి సమావేశం జరగనుంది. నలభై ఐదు కు పైగా అజెండా అంశాలపై చర్చించి తీర్మానాలు చేయనున్నట్టు సమాచారం. టీటీడీలోని కాంట్రాక్ట్ డ్రైవర్ల రెగ్యులరైజ్ అంశంపై చర్చించి...తీర్మానం చేయనున్నారు. తిరుమలలోని పాత భవనాలను నూతన డోనర్ స్కీమ్ కింద పునర్నిర్మించే ఆంశంపై చర్చించనున్నారు. వేదపారాయణదారులకు నిరుద్యోగి భృతి కింద నెలకు మూడు వేలు అందజేయాలని తీర్మానంతో పాటు పలు కీలకాంశాలపై చర్చించనున్నట్లు తెలుస్తోంది..



# టిపి కోటలో 'నో బ్యాక్ బెంచ్'

ప్రజాశక్తి - నాగలాపురం

సత్యవేడు నియోజకవర్గం నాగలాపురం మండలం టిపి కోట ప్రభుత్వ మోడల్ ప్రాథమిక పాఠశాలలో 'యూ' ఆకారంలో బెంచీలను అమర్చి వినూత్నంగా కేరళ తరహా విద్యాబోధనకు శ్రీకారం చుట్టారు. 'యూ' షేప్‌తో విద్యార్థుల్లో సమానత్వ భావన పెంపొందుతుందని, మెరుగైన ఫలితాలు వస్తాయని ప్రధానోపాధ్యాయులు వి.వెంకటరమణ 'ప్రజాశక్తి'కి తెలిపారు.

ఇటీవల వినేశ్ విశ్వనాథ్ దర్శకత్వంలో వచ్చిన మలయాళ సినిమా 'స్థానార్థి శ్రీకుట్టన్' క్లైమాక్స్' సీన్ స్ఫూర్తితో తొలుత కేరళలోని కొల్లం జిల్లాలోని రామవిలాసం ఒకేషనల్ హయ్యర్ సెకండరీ స్కూల్‌లో అక్కడి అధికారులు ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని ప్రారంభించారు. కేరళ రాష్ట్రంలోని పాఠశాలల తరగతి గదుల్లో విజయవంతంగా 'యూ' ఆకారపు బెంచీల అమరిక విధానం అమలవుతోంది. ఈ నేపథ్యంలోనే టిపి కోట మోడల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.వెంకటరమణ తమ ఉపాధ్యాయులతో కలిసి నూతన విధానానికి తెరదీశారు. ఇకపై పాఠశాల తరగతి గదుల్లో బ్యాచ్ బెంచ్‌లు కనిపించవని చెప్పారు. తరగతి గది మధ్యలో ఉపాధ్యాయులు నిలబడి పాఠాలు చెప్పే విధానాన్ని టిపికోట ప్రాథమిక పాఠశాలలో సోమవారం నుంచి అమల్లోకి తెచ్చారు. ఈ పాఠశాలలో మొత్తం 78 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రస్తుతం ఐదు తరగతులకు నాలుగు గదులు ఉన్నందున మూడు తరగతుల్లో యుటైప్ బెంచి అమరిక సిద్ధం చేసి తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు సైతం కొత్త తరహా బెంచిలలో కూర్చుని చదువుకోడానికి ఆసక్తి చూపుతున్నారు. విద్యార్థులందరూ ఒకే స్థాయిలో అభ్యసన ప్రక్రియలో పాలు పంచుకోడానికి అవకాశం లభిస్తుందని ఉపాధ్యాయులు భావిస్తున్నారు. ఈ విధానంలో బ్యాచ్ బెంచి సంస్కృతికి చెక్ పడుతుందని విద్యార్థుల్లో ఏకాగ్రత పెరుగుతుందని చెప్పారు.

## కేరళ తరహా వినూత్న ప్రయోగం
## 'యూ' షేప్‌తో విద్యార్థుల్లో సమానత్వం





# అచ్యుతానందన్‌కు అరుణాంజలి

ప్రజాశక్తి - సూళ్లూరుపేట , తిరుపతి టౌన్

కేరళ మాజీ ముఖ్యమంత్రి విఎస్ అచ్యుతానందన్ (102) సోమవారం మధ్యాహ్నం కన్నుమూశారు. ఆయన మృతికి సూళ్లూరుపేట సిపిఎం కార్యాలయంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేరళ మాజీ ముఖ్యమంత్రి 2006–2011 మధ్య కేరళ ముఖ్యమంత్రిగా పనిచేశారని, పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన ఎంతో కృషి చేశారన్నారు. కార్మికుల ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారని గుర్తు చేశారు. ఈ సంతాపసభ కార్యక్రమంలో నాయకులు కె.లక్ష్మయ్య, ఎస్కె రియాజ్, సి.చంద్రశేఖర్, సుంకర అల్లెయ్య పాల్గొన్నారు.



– తిరుపతి జిల్లా కమిటి కార్యాలయంలో సంతాపం తెలిపారు. దేశ రాజకీయాల్లో విలక్షణమైన చరిత్రను సృష్టించిన మహానాయకుడని విఎస్ అచ్చుతానందన్‌ను కొనియాడారు. జీవితం మొత్తం కార్మికులు, రైతులు, సామాన్య ప్రజల హక్కుల కోసం గడిపారన్నారు. కేరళ ముఖ్యమంత్రిగా, శాసనసభపక్ష నాయకునిగా, పోలిట్‌బ్యూరో సభ్యునిగా ఆయన పోషించిన పాత్ర ప్రజాస్వామ్య పరిరక్షణలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. తుది శ్వాసవరకూ నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడిన తీరు పార్టీ కార్యకర్తలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి.సుబ్రమణ్యం, జి.బాలసుబ్రమణ్యం, ఎస్.జయచంద్ర, సాయిలక్ష్మి, మాధవ్,రవి, రెడ్డెప్ప, బుజ్జి, మునిరాజ, అక్బర్ పాల్గొన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో అధ్యక్ష కార్యదర్శులు అక్బర్, భగత్‌రవి సంతాపం ప్రకటించారు.





శ్రీకాళహస్తి, తిరుపతిల్లో అంగన్‌వాడీల నిరసనలు

# అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ఆయా ప్రాజెక్టుల పరిధిలో తిరుపతి జిల్లావ్యాప్తంగా నిరసనలు తెలిపారు.

తిరుపతి ఆర్డీవో కార్యాలయం వద్ద సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం 26వేలు ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేశారు. నాయకులు వేణు, పి.లోకేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చాలన్నారు. మినీ అంగన్‌వాడీ వర్కర్లను మెయిన్ అంగన్‌వాడీ వర్కర్లుగా గుర్తిస్తూ జీవో విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.నాగరత్న, జయప్రభ, సుజాత, నిర్మల, జె.గంగాదేవి, శశికళ, సుభాషిణి, వరలక్ష్మి, బుజ్జి పాల్గొన్నారు.

– సూళ్లూరుపేటలో ఎఫ్ఆర్ఎస్ యాప్ రద్దు చేస్తామని సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీని అమలు చేయాలని ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు, మండల కార్యదర్శి లక్ష్మయ్య, ప్రాజెక్టు కార్యదర్శి హైమావతి పాల్గొన్నారు.

– తొట్టంబేడు మహిళా శిశు సంక్షేమ కార్యాలయం ఆవరణలో సిఐటియు, ఎఫ్ఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు పెనగడం గురవయ్య, జాకీర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా పేదలకు అందిస్తున్న పౌష్టిక ఆహారాన్ని నిలిపేయాలనే దురుద్దేశ్యంతోనే ప్రభుత్వం ఇటువంటి చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. నాయకులు గంధంమణి, అంగన్‌వాడీలు రేవతి పాల్గొన్నారు.

## జిల్లావ్యాప్తంగా ప్రాజెక్టుల పరిధిలో నిరసనలు

– గూడూరు టౌన్‌లో ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ముందు నిరసన తెలిపారు. యూనియన్ అధ్యక్షురాలు ఎ.ఇంద్రావతి మాట్లాడుతూ ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని, అంగన్‌వాడీ వర్కర్లపై వేధింపులు ఆపాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, వైఫై కనెక్షన్లు ఇవ్వాలని, సెల్‌ఫోన్‌కు సరిపడా జీబీ ఏర్పాటు చేయాలని డఈ కార్యక్రమంలో౦మాండ్ చేశారు. పిల్లలకు వంట చేసేందుకు సరిపడా గ్యాస్ సిలిండర్లు ఇవ్వడం లేదన్నారు. సెక్టార్ లీడర్లు ఎస్.కె ఆసియా బేగం, జే. లక్ష్మి, పి.భారతమ్మ, ఇ.పెంచలమ్మ, బి.ప్రభావతి, కె.రోజా, అలేఖ్య, సి.ఐ.టి.యు నాయకులు జోగి.శివకుమార్, బి.వి. రమణయ్య, అడపాల ప్రసాద్, ఎంబేటి చంద్రయ్య పాల్గొన్నారు.

– పిచ్చాటూరు ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సిఐటియు ప్రాంతీయ కార్యదర్శి నాగలాపురం నాగరాజు, ప్రాజెక్టు కార్యదర్శి ఇంద్రాణి నేతృత్వంలో నిరసన తెలిపారు. కృష్ణవేణి, భారతి, పూర్ణమ్మ, కల్యాణిదేవి, ప్రమీల, శ్రీదేవి, జయంతి, నాగభూషణమ్మ, సావిత్రి పాల్గొన్నారు. నాలుగు మండలాల పరిధిలో అంగన్‌వాడీలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

– పుత్తూరు టౌన్‌లో.. అంగన్‌వాడీలకు కొత్త ట్యాబ్‌లు వెంటనే ఇవ్వాలని ధర్నా నిర్వహించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు 2022లో ఫోన్లు ఇచ్చారని, 90శాతం ఫోన్లు చెడిపోయాయన్నారు. యాప్‌లు పని చేయడం లేదన్నారు. సిడిపిఒ ప్రమీలకు వినతిపత్రం సమర్పించారు. మునికుమారి, విజయ్‌కుమారి, రాధ,పద్మజ, లలిత, ధనమ్మ, లక్ష్మి, దుర్గ, గంగులమ్మ, కృష్ణవేణి, జయంతి, హైమావతి, నాగమణి పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 329 అర్జీలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

**రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇచ్చే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారాన్ని గడువులోపు చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షి, డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్ర రెడ్డి, సుధారాణి, రోజ్ మాండ్ లతో కలిసి జాయింట్ కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. ఎప్పటిలాగే రెవెన్యూ శాఖకు సంబంధించి 165 అర్జీలు వచ్చాయని అధికారులు ప్రకటించారు.**

**మా ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి...**



తిరుపతి జిల్లాలో ఎంటియు 1010 రకం ధాన్యాన్ని దాదాపు లక్ష ఎకరాలకు పైగా పండించాం. ఈ రకం ధాన్యాన్ని ప్రైవేటు వ్యక్తులు 77 కేజీలను రూ.1300 లకు కొనుగోలు చేయడానికి ముందుకు వస్తుండడంతో పండించిన రైతు 77 కేజీలకు గాను రూ.450 నష్టపోతున్నాడు. ఈనెల 25వ తేదీ నుండి కోతలు మొదలు పెడుతున్నాం. రాష్ట్ర ప్రభుత్వం ఈ–క్రాప్ లో నమోదు చేసి కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కనుగోలు చేస్తే రైతుకు మేలు చేకూర్చే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరగా రూ.1740 ప్రకటించింది. రైతులు నష్టపోకుండా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఎంటియు 1010 రకం దాన్ని కొనుగోలు చేయాలి. **- కనపర్తి గోపీనాథ్ రెడ్డి, తిరుపతి పార్లమెంట్ టిడిపి రైతు అధ్యక్షులు**

**మా స్థలాన్ని ఆన్లైన్ చేసి ఇవ్వాలి....**



2017లో మల్లెల రామకష్ణయ్య వద్దనుండి 18 సెంట్లు స్థలాన్ని కొనుగోలు చేశాను. అప్పటినుండి ఆయన రెవెన్యూ కార్యాలయానికి వచ్చి మా పేరుపై ఆన్లైన్ చేసి ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. స్థలం వాద్దలదారులు రాఘవులు, సుందరయ్య, కష్ణయ్య తదితరులు నిత్యం గొడవలకు దిగుతూ దాడి చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ కలుగజేసుకుని నా భూ సమస్య పరిష్కారం చేయండి. **- పల్లిపట్టు వెంకటయ్య, బాలాయపల్లి**

**దివ్యాంగుడికి న్యాయం చేయండి....**



మా తండ్రి కె. వెంకటయ్య తన స్వయార్జితం అయిన భూమిని భాగ పరిష్కారాలలో భాగంగా ఎ1.83 సెంట్లు 2023లో తన పేరుపై రాసిచ్చాడు. వన్ బి అడంగల్ కోసం రెవెన్యూ సదస్సులో అర్జీలు ఇచ్చాను. కానీ ఇప్పటివరకు నా సమస్య పరిష్కారం కాలేదు. నేను వికలాంగుడిని సమస్య పరిష్కారం కోసం ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఆర్థికంగా నష్టపోతున్నాను. నాకు చెందిన భూమిలో చిన్నపాటి వ్యవసాయాన్ని చేసుకుంటూ జీవిస్తున్నాను. నాకు ఆడపిల్లలు ఉన్నారు దయవుంచి జిల్లా కలెక్టర్ రెవెన్యూ సదస్సులో ఇచ్చిన నా అర్జీకి పరిష్కారం చూపాలి. **- కె. కోటేశ్వరరావు, కూవాకొల్లి గ్రామం, వరదయ్యపాలెం మండలం, తిరుపతి జిల్లా.**

## బాలికోన్నత పాఠశాలలో ఫ్యాకల్టీని నియమించండి

ప్రజాశక్తి - రేణిగుంట

బాలికల ఉన్నత విద్యను ప్రోత్సహించడంలో భాగంగా రేణిగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంటర్ తరగతులు 2022 నుంచి జరుగుతున్నాయి. ఈ విద్యా సంవత్సరం 81 శాతం ఉత్తీర్ణత సాధించింది. ఉద్యోగ విరమణ వల్ల బాటనీ, ఇంగ్లీష్ అధ్యాపకుల కొరత ఏర్పడిన నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి ఫ్యాకల్టీని నియమించాలని పూర్వ విద్యార్థుల సంఘం, విద్యా వికాస వేదిక, జనవిజ్ఞాన వేదిక సంయుక్తంగా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. గత ఏడాది మూడో గ్రూప్‌గా ఏర్పాటు చేసిన సిఇసికి కామర్స్, ఎకనామిక్స్, సివిక్స్ సబ్జెక్టులకు అధ్యాపకులను మంజూరు చేయకపోవడం వల్ల ఫలితాలు దెబ్బతిన్నాయన్నారు. ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఎంపిసి 25, బైపిసి 37, సిఇఇ 38 మంది మొత్తం వంద మంది విద్యార్థినులు చదువుతున్నారు. సిఇసి అధ్యాపకులు లేరని తెలుసుకున్న తల్లిదండ్రులు దాదాపు 15 మంది విద్యార్థినులను వెనక్కి తీసుకెళ్లి ప్రైవేట్ కాలేజీల్లో చేర్చారన్నారు. కనుక వెంటనే బాటనీ, ఇంగ్లీష్, కామర్స్, ఎకనామిక్స్, సివిక్స్ అధ్యాపకులను ఏర్పాటు చేసి, విద్యార్థుల నైపుణ్యాన్ని పెంచాలని కోరారు.

## ఎబిఆర్ఎస్ అధ్యక్షులుగా ఎన్.వెంకటరత్నం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

పద్మవిభూషణ్ డా.నిర్మలా దేష్ పాండే స్థాపించిన అఖిలభారత రచనాత్మక సమాజ్ (ఏ.బి.ఆర్.ఎస్.) జాతీయ అధ్యక్షులుగా రాష్ట్రీయ సేవా సమితి(రాస్) ప్రధాన కార్యదర్శి డా.ఎస్. వెంకటరత్నం నియమించబడ్డారు. మధ్యప్రదేశ్ లోని ఉజ్జయినిలో సేవా ధామ్ ఆశ్రమం లో ఆదివారం జరిగిన జాతీయ కార్యవర్గ సమావేశంలో డా.ఎస్. వెంకటరత్నంను ఎన్నుకున్నట్లు ఆల్ ఇండియా హరిజన సేవక్ సంఘ్ జాతీయ అధ్యక్షులు శంకర్ కుమార్ సన్యాల్, బీహార్ మాజీ పార్లమెంట్ సభ్యులు నరేశ్ యాదవ్ చేతుల మీదుగా సర్టిఫికేట్ అందుకున్నారు.

## బలిజ భవన్ నిర్మించాలని సిఎంకు వినతి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి తిరుపతి పర్యటనలో భాగంగా తిరుపతి ఎయిర్పోర్టు నందు జనసేన నేత, బలిజసేన రాష్ట్ర అధ్యక్షులు ఆర్కాట్ కష్ణప్రసాద్ కలసి తిరుపతిలోని బలిజభవన్ నిర్మించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్కాట్ కష్ణప్రసాద్ మాట్లాడుతూ రాయలసీమలో బలిజలు ఎక్కువగా ఉన్నారని, అందులో తిరుపతిలో అధికసంఖ్యలో బలిజలు ఉన్నారని వారికోసం బలిజభవన్ ను నిర్మించాలని కోరారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తూ రాబోయే కాలంలో త్వరలో నిర్మాణం చేపడదామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి శాసనసభ్యులు అరణి శ్రీనివాసులు, హస్తకళల చైర్మెన్ డా. పసుపులేటి హరిప్రసాద్ , జనసేన నగర అధ్యక్షులు రాజారెడ్డి , తమ్మినేని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.






సూళ్లూరుపేటలో..అదానీ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ..

## 'స్మార్ట్' దోపిడీ 'మీటర్ల'పై నిరసన హోరు

ప్రజాశక్తి - సూళ్లూరుపేట

'స్మార్ట్ మీటర్లు వద్దే వద్దు..' అంటూ సిపిఎం ఆధ్వర్యంలో సూళ్లూరుపేటలో నిరసన ప్రదర్శన జరిగింది. సిపిఎం కార్యాలయం నుంచి ఎపిఎస్‌పిడిసిఎల్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ కార్యాలయం వరకూ ప్రదర్శనగా వెళ్లి ఎఇకి వినతిపత్రం సమర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, నాయకులు చంద్రశేఖర్ మాట్లాడుతూ అధికారంలోకి రాక ముందు నారా లోకేష్ పాదయాత్రలో అప్పటి ప్రభుత్వం మీటర్లను బిగిస్తుంటే వాటిని పగలగొట్టండి అని పిలుపునిచ్చారని, ఆ విషయాన్ని మరచి అధికారంలోకి రాగానే దొడ్డిదారిన వినియోగదారులకు సమాచారం లేకుండానే స్మార్ట్ మీటర్లను బిగించడం దుర్మార్గమని అన్నారు. కూటమి ప్రభుత్వం కేంద్రానికి లొంగిపోయి మోడీ స్నేహితుడైన అదానీకి రాష్ట్ర ప్రజల నుంచి దోచి పెట్టడానికే స్మార్ట్ మీటర్లకు అవకాశాన్ని కల్పించారన్నారు. ప్రభుత్వం వెనకడుగు వేయకపోతే, ప్రజలను చైతన్యపరచి స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని తీసుకొస్తామని హెచ్చరించారు. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల వల్ల నిరక్షరాస్యులైనవారు, స్మార్ట్ ఫోన్లు లేని వినియోగదారులు రీఛార్జి చేసుకోలేక ఇబ్బందులు పడతారన్నారు. ఈకార్యక్రమంలో రైతుసంఘం నాయకులు అల్లెయ్య, నాయకులు రియాజ్, పద్మనాభయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

## తిరుపతిలో టైటాన్ షోరూం ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ఎఐఆర్ బై పాస్ రోడ్డులో సోమవారం ఉదయం టైటాన్ షో రూంను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. టైటాన్ కంపెనీ వాచ్ లతో పాటు ప్రసిద్ధి చెందిన ఇంటర్నేషనల్ బ్రాండ్స్ వాచ్ లు షోరూంలో లంభించనున్నాయి. ఆయా బ్రాండ్స్, వాటి నాణ్యత వివరాలను షో రూం యజమాని ప్రభాకర్ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులకు వివరించారు. యాత్రాస్థలమైన తిరుపతిలో టైటాన్ షో రూం ప్రారంభించడం సంతోషంగా ఉందని మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి తెలిపారు. సెల్ ఫోన్ లు ఉన్నా వాచ్ లకు ఎప్పటికీ ప్రాధాన్యత ఉంటుందని ఆయన చెప్పారు. టూరిజం కేంద్రంగాను అభివద్ధి చెందుతున్న తిరుపతికి శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులు తమ గుర్తుగా ప్రముఖ బ్రాండ్స్ వాచ్ లను కొనే అవకాశం ఉందని ఆయన తెలిపారు. చెన్నై, హైదరాబాద్, ముంబైల కే పరిమితమైన బ్రాండ్స్ ను తిరుపతిలో అందుబాటులోకి షో రూం యజమాని ప్రభాకర్ తేవడాన్ని అభినందిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో టైటాన్ కంపెనీ సౌత్ హెడ్ అజయ్ ద్వివేది, ఏపి హెడ్ అజయ్ మౌర్య. ఏబిఎం ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## రాజుగుంట పాఠశాలకు తాళం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి మోడల్ స్కూళ్ల పేరిట కూటమి సర్కార్ అవలంబిస్తున్న పాఠశాలల విలీన ప్రక్రియపై వెంటనే వెనక్కి తగ్గాలని శ్రీకాళహస్తి మండలంలోని రాజుగుంట గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. 3, 4, 5 తరగతులను మన్నవరంలో విలీనం చేయడాన్ని నిరసిస్తూ సోమవారం రాజుగుంట గ్రామ ప్రాథమిక పాఠశాలకు తాళాలు వేశారు.



గ్రామానికి మూడు కిలోమీటర్ల అవతల ఉన్న మన్నవరానికి వెళ్లి రావాలంటే మార్గమధ్యంలో అవరోధాలు చాలానే ఉన్నాయని వారు వాపోయారు. వర్షాకాలం ఏటి కాలువ ఉప్పొంగి ప్రవహించే క్రమంలో పిల్లలు పాఠశాలకు ఎలా చేరుకోవాలని ప్రశ్నించారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని తమ పిల్లలను మన్నవరం పంపాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు. విలీన ప్రక్రియ ఆపాలని గత నెల రోజులుగా అధికారులు, ప్రజా ప్రతినిధుల చుట్టూ కాళ్ళరిగేలా తిరుగుతున్నా ప్రయోజనం శూన్యమని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ స్పందించి విలీన ప్రక్రియను ఆపాలని కోరారు.

## వర్షాల్లో అప్రమత్తంగా ఉండండి : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

వర్షాలు కురుస్తున్న తరుణంలో నగరంలోని ప్రజలు, అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పిలుపునిచ్చారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని విభాగాల అధికారులతో మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న తరుణంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. కాగా డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫోన్ ద్వారా 15 మంది తమ సమస్యలు తెలుపగా, 40 మంది నేరుగా వచ్చి వినతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, గోమతి, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, రవి ఉన్నారు.



సూళ్లూరుపేటలో..

# సమస్యలు పరిష్కరించేంత వరకూ 'సమ్మె'

ప్రజాశక్తి - గూడూరు టౌన్, సూళ్లూరుపేట

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో మున్సిపల్ ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకూ సమ్మె ఆపే ప్రసక్తే లేదని నేతలు ఉద్ఘాటించారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) అనుబంధం ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మె సోమవారానికి 9వ రోజుకు చేరుకుంది. ఏడేళ్లుగా తమ బాధలు చెప్పుకుంటూనే ఉన్నామని, సమస్యలు పరిష్కరిస్తామని పాలకులు వాగ్దానాలు చేస్తూ కల్లబొల్లి కబుర్లు చెబుతూనే ఉన్నారన్నారు. చాలీచాలని జీతాలతో తమ బాధలు అర్థం చేసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమ్మెకు అంగన్‌వాడీ వర్కర్స్ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ జిల్లా కార్యదర్శి ధారా కోటేశ్వరరావు, గౌరవాధ్యక్షులు జోగి శివకుమార్, సి.ఐ.టి.యు గూడూరు పట్టణ ప్రధాన కార్యదర్శి బి.వి.రమణయ్య, అడపాల ప్రసాద్, గుర్రం రమణయ్య, ఎంభేటి చంద్రయ్య, అంగన్వాడి వర్కర్స్ రూరల్ అధ్యక్షురాలు ఏ.ఇంద్రావతి, సెక్టార్ లీడర్లు ఎస్.కె.ఆసియా బేగం, లక్ష్మి, భారతమ్మ, పెంచలమ్మ, ప్రభావతి, రాజేశ్వరి పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమ్మెకు అంగన్‌వాడీల మద్దతు



నాయుడుపేటలో అర్ధనగ్న ప్రదర్శన

– సూళ్లూరుపేటలో మున్సిపల్ కార్యాలయం వద్ద శిబిరంలో నిరసన తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి హైమావతి సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎస్కె రియాజ్, కె.సాంబశివయ్య, కె.లక్ష్మయ్య, అక్బర్‌బాష, భాస్కర్, ఫయాజ్ పాల్గొన్నారు.


**- నాయుడుపేటలో...** జీవో నంబర్ 36 ప్రకారం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని యూనియన్ జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య, సిఐటియు తిరుపతి జిల్లా కార్యవర్గ సభ్యులు లక్ష్మి, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయుడుపేట ప్రాజెక్టు కార్యదర్శి ఎస్.శ్యామలమ్మ డిమాండ్ చేశారు. సోమవారం సమ్మెలో భాగంగా అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్లు శిబిరం వద్దకు వచ్చి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.శ్రీనివాసులు, నాగరాజు, రామచంద్రయ్య, వీరాస్వామి, విషాద్, రమేష్, సాయి, సురేష్, మస్తాన్, మునిరాజా పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్:** తిరుపతి నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నియోజక ఓటరు నమోదు అధికారి, కమిషనర్ ఎన్.మౌర్య సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఆదేశాల మేరకు సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నియోజక ఓటరు నమోదు అధికారి మాట్లాడుతూ నగరంలో 274 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఇందులో 90 పోలింగ్ కేంద్రాల్లో 1200 కు పైన ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఒక పోలింగ్ కేంద్రంలో 1200 ఓట్లు కంటే ఎక్కువ ఉంటే సమీపంలోనే మరో పోలింగ్ కేంద్ర ఏర్పాటు చేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. కొత్త పోలింగ్ కేంద్రాల వివరాలు అందరూ పరిశీలించి అభిప్రాయాలు తెలపాలన్నారు. ఒకే కుటుంబంలోని వారి ఓట్లు ఒకే కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల నుండి వచ్చిన వినతులను పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ రఘువంశీ, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, తహశీల్దార్ సురేష్ కుమార్, ఈడిటి సుధాకర్ నాయక్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.


వివిధ రాజకీయ పార్టీలకు పోలింగ్ కేంద్రాలపై మాట్లాడుతున్న కమిషనర్ మౌర్య

## ఫ్లై ఓవర్ వెంటనే పూర్తి చేయాలి


సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాకి కాంగ్రెస్ నాయకుల వినతి

**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** గత 13 ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న ఫ్లై ఓవర్ బ్రిడ్జిని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు వినియోగంలోకి తీసుకురావాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంటా శ్రీనివాసులు రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం గూడూరు, సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి నిరసన చేపట్టారు. అనంతరం సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాకి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2009లో, నాటి సీఎం డాక్టర్ వై. ఎస్.రాజశేఖర్ రెడ్డి గూడూరు ఫ్లై ఓవర్‌కి నిధులు మంజూరు చేశారన్నారు. కాంగ్రెస్ హయాంలో తప్ప మిగతా టీడీపీ, వైసిపి ప్రభుత్వాలు ఫ్లై ఓవర్‌ను పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. 90 శాతం పూర్తి అయిందని, మిగతా పది శాతం పనులు త్వరిత గతిన పూర్తి చేసి, ప్రజలకు వినియోగంలోకి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రావూరు బ్రహ్మయ్య, సుబ్బరాజు, చిల్లకూరు వేమయ్య, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టిసి బస్టాండ్ స్వీపర్లకు పిఎఫ్ చెల్లించాలి

**ప్రజాశక్తి - పుత్తూరు :** పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్లో, గ్యారేజ్ స్వీపర్లుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ మహిళా కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ డబ్బును వారి ఖాతాలో జమ చేయకుండా కార్మికులను మోసం చేస్తున్నారని, సిపిఎం జిల్లా నాయకులు ఆర్ వెంకటేష్ ఆరోపించారు. సోమవారం పుత్తూరు తహశీల్దారు వెంకటేశ్వర్లును సిపిఎం నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ కాంట్రాక్టర్‌ను కార్మికులు పీఎఫ్ డబ్బు అడిగితే నాకు సంబంధం లేదని, తప్పుదారి పట్టించడం దారుణమన్నారు. ఆర్టీసీ డిపో మేనేజర్ స్పందించి వారికి పీఎఫ్ డబ్బులు, జీవో ప్రకారం జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో డిపో ఎదుట ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాగులమ్మ, మునియమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## 'పీఎం శ్రీ' పాఠశాలల తనిఖీ

**ప్రజాశక్తి -కోట :** సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోర్డినేటర్ (ఏపీసీ)గౌరీ శంకర్ రావు, ఏఎంఓ శివశంకర్‌లు సోమవారం చిట్టేడు గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో మౌలిక వసతులపై ఆరా తీశారు. కేంద్రం నుండి నిధులు మంజూరయి నందున ఉత్తమ పాఠశాలగా తీర్చి దిద్దాలని ప్రిన్సిపాల్ శుభకర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో కోట, వాకాడు ఎమ్ఈఓలు దారా మస్తానయ్య, వలీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ:** మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం డిస్టిక్ కమిటీ మెంబర్స్ పరిశీలించారు. పీఎం శ్రీ స్కీం కింద నిర్మించిన కెమిస్ట్రీ ల్యాబ్, కిచెన్ గార్డెన్, రాంప్, ప్లేగ్రౌండ్, స్కూల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ వంటి వసతులను పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలిచ్చారు.

## 'ఏ డే విత్ చైర్మన్' కార్యక్రమానికి శ్రీకారం


అధికారులకు వివరిస్తున్న తుడ చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్:** రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి 'ఏ డే విత్ తుడా చైర్మన్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తుడా పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో స్థానిక శాసన సభ్యులతో కలసి తుడా అధికారులు, స్థానిక ప్రభుత్వ అధికారులు కలిసి పర్యటించి ప్రజల అవసరాలు గుర్తించి అక్కడే అనుమతులు మంజూరు చేసే విధంగా నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అదేవిధంగా ఆయా ప్రాంతాల్లో అనుమతులు లేని లేఅవుట్లను, అనుమతి లేని భవన నిర్మాణాలను గుర్తించి వారు కూడా అనుమతులు పొందే విధంగా చర్యలు తీసుకుంటారు. డ్రైనేజీ నిర్మాణాలు, సిసి రోడ్డు, చెరువుల బ్యూటిఫికేషన్, ప్రభుత్వ పాఠశాలలకు ఆట వస్తువులు మంజూరు చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంపై సోమవారం తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుడా అభివృద్ధిపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సానుకూలంగా ఉన్నారని, కావలసిన నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని తెలియజేశారు. ప్రతి మండలంలో 5 నుంచి 10 కోట్లు తుడా నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఏ ఏ అభివృద్ధి పనులు కావాలో గుర్తించడానికి ఏ డే విత్ తుడా చైర్మన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. తుడాకు మంచి పేరు తీసుకువచ్చే విధంగా అధికారులు కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తుడా సెక్రటరీ శ్రీకాంత్, సూపరింటెండెంట్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవీంద్ర, ప్లానింగ్ ఆఫీసర్ దేవి కుమారి తదితర అధికారులు పాల్గొన్నారు.

## క్షుద్ర పూజలు వెంటనే ఆపాలి : సిపిఎం


**ప్రజాశక్తి - తడ :** తిరుపతి జిల్లా, తడ మండలం, కొండూరు గ్రామపంచాయతీ నేషనల్ హైవేని ఆనుకొని ఉన్న ఓం శ్రీ జగత్ చాముండేశ్వరి శక్తిపీఠంలో రకరకాల క్షుద్ర పూజలు, శక్తిపీఠం చుట్టుపక్కల క్షుద్ర పూజలు చేసిన తర్వాత నిమ్మకాయలు, టెంకాయలు, పసుపు కుంకుమతో కొండూరు గ్రామ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని సిపిఐ(యం) జిల్లా కార్యదర్శి వందవాసం నాగరాజు ఆరోపించారు. ఈ విషయమై అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, అధికారులు బోర్డులు పెట్టినా, పూజారి మాత్రం ఆ ప్రాంగణాన్ని వదిలి పోలేదు. ఆ ఆవరణంలో ఉండే కొండూరమ్మ గ్రామ దేవతే మాకు చాలు, మాకు ఎటువంటి శక్తి పీఠాలు అవసరం లేదని పూజారికి చెప్పిన వినలేదని గ్రామస్తులు తెలిపారు. పూజలు వద్ద మహిళలు, పురుషులు, ఫోటోలు ఉన్నాయని, ఆయుర్వేద మందులు కూడా వాడుతున్నారని, కొండూరులో ఈమధ్య చాలామంది చనిపోయారని, ఇలా జరగటంతో కొండూరు గ్రామ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని సిపిఐ (యం) నాయకులు తెలిపారు. ఆదివారం కొండూరు గ్రామస్తులు శక్తి పీఠాన్ని ధ్వంసం చేసినప్పుడు అధికారులు వారం రోజులు సమయం అడిగారని, కాబట్టి ఈ వారం రోజుల్లో ఆ శక్తిపీఠాన్ని పూర్తిగా తీసి వేయించి కొండూరు గ్రామ ప్రజల భయాన్ని పోగొట్టాలని సిపిఐ(యం) పార్టీ తరఫున తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు సుధాకరయ్య, మండల సిఐటియు కార్యదర్శి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## భూముల రీ సర్వే పూర్తి

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తి మండలం, ఎర్రగుడిపాడులో భూముల రీ సర్వే కార్యక్రమం పూర్తయిందని తహశీల్దార్ జనార్ధన రాజు తెలిపారు. ఎర్రగుడిపాడులో భూముల రీ సర్వే ప్రాజెక్ట్ సభను నిర్వహించారు. రీ సర్వే పూర్తి చేయగా, అందులో పొందుపరిచిన రైతుల వివరాలను తెలియపరిచారు. రైతుల నుంచి అభ్యంతరాలు రాకపోవడంతో సభను ముగించారు. ఆర్ఐ రామకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ల అభివృద్ధికి సహకరించండి : మంత్రికి వినతులు

### రహదారి ఏర్పాటు చేయాలి : మట్టం శ్రావణి రెడ్డి


మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డికి తెలుగు పార్లమెంట్ మహిళ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి వినతి

**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** ఆర్ అండ్ బి రోడ్లను ఏర్పాటు చేయాలని, తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి పేర్కొన్నారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆర్ అండ్ బి మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి గూడూరుకు వచ్చారు. ఈ సందర్భంగా తెలుగు పార్లమెంట్ మహిళ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి రోడ్ల సమస్యలపై వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గూడూరు మండల పరిధిలోని చెన్నూరులో ఎన్నో సంవత్సరాలుగా ప్రజలు రకపోకలుకు ఇబ్బందిపడుతున్నారని, వెంకటగిరి-రావూరు రోడ్డు నుండి చెన్నూరు, మంగళపూరు మీదుగా పారిచర్లరాజుపాళెం, కొత్త తుంగ గపాళెం రోడ్డు అధ్వాన్నంగా ఉందన్నారు. ఈ రోడ్డు వెంకటగిరి - రాపూరు రోడ్డు నుండి చెన్నకేశవస్వామి దేవస్థానం వరకు ఉందని తెలిపారు. ఈ పరిసరాల్లో వరదతాకిడి ఎక్కువగా ఉంటుంది, కవున ఇది మూడు లేయర్లుగా ధృఢంగా వేయవలసిన అవసరం ఉన్నదన్నారు. ఈ రోడ్డు కూడా ఆర్ అండ్ బి పరిధిలోకి తీసుకురావాలని కోరారు.

### రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

**ప్రజాశక్తి - వాకాడు:** వాకాడు మండల పరిధిలోని తీర ప్రాంత గ్రామాలైన రావి గుంట పాలెం, నిడుగుర్తి, మూల పడవ, పూడి రాయిదొరువు పంచాయతీ పరిధిలోని ఆర్ అండ్ బి రోడ్ల ఆధునికరణకు, నూతన రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయవలసిందిగా ఆర్ అండ్ బి శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డికి, మాజీ టిడిపి వాకాడు మండల అధ్యక్షుడు దువ్వూరు అజిత్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం గూడూరులో మంత్రి జనార్ధన్ రెడ్డిని కలిసి సన్మానించి, తీర ప్రాంత ఆర్ అండ్ బి రోడ్ల దుస్థితిని వివరించారు. స్పందించిన మంత్రి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో టిడిపి నాయకులు రవి రెడ్డి, రమేష్, ప్రదీప్ రెడ్డిలు ఉన్నారు.

### కోట మండలంలో ఆర్ అండ్ బి రోడ్లు బాగుచేయండి

**ప్రజాశక్తి-కోట :** చిల్లకూరు మండలం, పల్లమాల వయా కోట మీదుగా వాకాడు మండలం, తూపిలిపాలెం వరకు 200 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న ఆర్ అండ్ బి రహదారులు మధ్యలో ఆపివేయడంతో అధ్వాన్నంగా మారాయని, వెంటనే సదరు రోడ్ల నిర్మాణం చేపట్టి పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని రోడ్లు అండ్ భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల మంత్రి బిసి జనార్ధన్ రెడ్డిని టీడీపీ నేత, మాజీ ఏంపిపి నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి కోరారు. సోమవారం చిల్లకూరు మండలం, బూదనం జాతీయ రహదారి వద్ద నున్న హోటల్‌కు మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా గూడూర ఎమ్మెల్యే సునీల్ కుమార్‌తో కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మండల పరిధిలో నిర్మాణంలో ఉండి ఆగిన రోడ్ల దుస్థితిని వివరించారు. ఆర్ అండ్ బి శాఖ మంత్రి తక్షణమే చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా, ప్రయాణం సాగేలా చూడాలని కోరారు.

## డ్రగ్ డెవలప్మెంట్‌లో క్లినికల్ ఫార్మకాలజీ కీలకం

**ప్రజాశక్తి - రామచంద్రపురం :** ఔషధ అభివృద్ధిలో క్లినికల్ ఫార్మకాలజీ పాత్ర కీలకమని బివన్ మెడిసెన్స్ డైరెక్టర్ నాగేశ్వర్ ఆర్. బుద్ధ తెలిపారు. సోమవారం వెంకటరామాపురం సమీపంలోని సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాలలో 'క్లినికల్ ఫార్మకాలజీ ఇన్ డ్రగ్ డెవెలప్మెంట్' అనే అంశంపై జాతీయ వర్క షాప్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి వక్తగా స్విట్జర్లాండ్‌కి చెందిన నాగేశ్వర్ ఆర్. బుద్ధ హాజరై మాట్లాడుతూ ఔషధం శరీరంలోకి ఎలా ప్రవేశిస్తుంది, ప్రవేశించిన తర్వాత దాని ప్రభావం ఎలా ఉంటుందని అంచనా వేయడంలో క్లినికల్ ఫార్మకాలజీ ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సిరంజన్ బాబు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ఔషదాలు ప్రీ క్లినికల్ విభాగంలో విఫలమవుతున్నాయని, క్లినికల్ ఫార్మకాలజీ ద్వారా క్లినికల్ దశకు ఔషధాలు చేరుకుంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల బోధన సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## మద్యం కుంభకోణంలో మాజీ నేత హస్తం



**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** ఏపీ మద్యం కుంభకోణంలో శ్రీకాళహస్తికి చెందిన గత పాలక నేత హస్తం ఉన్నట్లుగా అనుమానాలున్నాయని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక డాక్టర్ ఉమేష్ రావు సోమవారం ఆరోపించారు. మద్యం కుంభకోణంలో ఏ-10గా ఉన్న షేక్ సైఫ్ అహ్మద్ శ్రీకాళహస్తివాసి కావడం ఇందుకు బలాన్ని చేకూరుస్తోందని తెలిపారు. గత పాలకుల చొరవతో షేక్ సైఫ్ అహ్మద్ మద్యం వ్యాపారంలో చోటు దక్కించుకున్నట్లు ఆరోపించారు. ఆయన ద్వారా గత నేత బాగానే వెనకేసుకున్నారని విమర్శించారు. కోవిడ్ సమయంలో నియోజకవర్గంలో పెద్ద ఎత్తున మద్యం పక్కదారి పట్టినట్లు ఆరోపించారు. మద్యం కుంభకోణంలో శ్రీకాళహస్తి ఫైల్స్ పై సిట్ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మిన్నల్ రవి, మునిరాజా యాదవ్, కిషోర్, కోటా చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అతిథి అధ్యాపకులకు రెన్యువల్ ఆర్డర్స్ ఇవ్వాలి

**ప్రజాశక్తి - క్యాంపస్:** ప్రతి సంవత్సరం అతిథి అధ్యాపకుల రెన్యువల్ ఆర్డర్‌ను అకడమిక్ సంవత్సరం మధ్యలో ఇవ్వడం జరుగుతుంది. సెమిస్టర్ విధానం ప్రవేశపెట్టి నప్పటి నుంచి అతిథి ఆధ్యాపకల అవసరం చాలా ఎక్కువగా ఉన్నది దీనికి కారణం రెగ్యులర్ స్టాఫ్ లేకపోవడం. కాంట్రాక్ట్ స్టాఫ్ కొరత ఉండటం, కొత్త సిలబస్ ప్రవేశపెట్టడంతో అతిథి అధ్యాపకుల సేవలు ఎంతగానో ఆవశ్యకమవుతున్నాయి. పనిచేస్తున్న అతిథి అధ్యాపకులు అందరూ యుజిసి నిబంధనల మేరకు పిహెచ్ డి లేదా నెట్ పరీక్షలలో ఉత్తీర్ణులు అయినవారే. కళాశాల యజమాన్యాలు వీటిని గుర్తించి అతిథి అధ్యాపకులను అకాడమిక్ ప్రారంభం నుంచి తీసుకోవాలని అలాగే సెమిస్టర్ విధానం వలన వీరి సేవలను సంవత్సర పర్యాంతం కొనసాగించాలని కోరుతున్నారు. కళాశాలలు ప్రారంభమై 40 రోజులు గడుస్తున్న తమకు ఎటువంటి ఆర్డర్స్ అందలేదని అతిథి అధ్యాపకులు వాపోయారు.

## ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

**ప్రజాశక్తి - తొట్టంబేడు :** మండలంలోని కాసరం పంచాయతీ, ప్రాథమిక వైద్యశాలలో సోమవారం తిరుపతి స్విమ్స్ ఆసుపత్రి వారిచే, స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.వి కుమార్ ఆదేశాల మేరకు, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ నాగరాజు పర్యవేక్షణలో కాన్సర్ పరీక్షలు నిర్వహించారు. కాసరం ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి మాధవ్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంతో గ్రామస్తులకు కేన్సర్లపై అవగాహన, రక్షణ అభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారి శివకుమార్, సిమ్స్ మెడికల్ వైద్యాధికారి డాక్టర్ పద్మావతి, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆధార్ సెంటర్ల సమయం పెంచాలి

**ప్రజాశక్తి - రేణిగుంట:** ఆధార్ సెంటర్ల సమయం పెంచాలని జనవిజ్ఞాన వేదిక రేణిగుంట మండల కార్యదర్శి కే కుప్ప స్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గ్రీవెన్స్‌లో ఆధార్ సెంటర్ విషయమై వినతిపత్రం సమర్పించారు. ఆధార్ సెంటర్లు రేణిగుంటలో 10.30 నుంచి 1.30 వరకే ఉంటున్నాయని, నిర్వాహకులు ఇతర ఫీల్డ్ వర్కు చూడాల్సి ఉండటం వల్ల చాలా మంది వెనక్కి తిరిగి వెళ్లిపోతున్నారన్నారు. పూర్తికాలం అందుబాటులో ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఆర్ అండ్ బి శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, టీడీపీ నాయకులు

**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఆర్ అండ్ బి శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. గూడూరు, జనార్ధన్ రెడ్డి కాలనీలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గూడూరులో మంత్రికి ఎమ్మెల్యే, టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. మంత్రి వార్డులో ఇంటింటికి తిరిగి సుపరిపాలన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది మాటల ప్రభుత్వం కాదు, చేతల ప్రభుత్వం అని తెలిపారు. అనంతరం పంబలేరు బ్రిడ్జిని పరిశీలించి, త్వరిత గతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మంత్రి వెంట గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, పట్టణ రూరల్ అధ్యక్షులు పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర రాజు, టీడీపీ కార్యదర్శి నెలబల్లి భాస్కర్ రెడ్డి, రహీం, శీలం కిరణ్ కుమార్, మట్టం శ్రావణి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సుపరిపాలనలో తొలి అడుగు

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** పుత్తూరు మున్సిపాలిటీ, చెర్లోపల్లిలో సోమవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు వివరిస్తూ, కరపత్రాలిచ్చారు. ఆయన మాట్లాడుతూ15 సంవత్సరాలుగా పెండింగ్‌లక్ష ఉన్న నగిరి గాలేరు కాలువను పూర్తిచేసే ఆలోచనలో కూటమి ప్రభుత్వం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఏ ఆనంద్, మాజీ చైర్మన్ అంకయ్య, చిత్తూరు పార్లమెంటరీ ఉపాధ్యక్షులు చిన్నబాబు, మార్కెట్ కమిటీ, డైరెక్టర్ రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ డిఎస్ గణేష్, విక్కీ రాయల్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ:** బుచ్చినాయుడు కండ్రిగ మండలం, పార్లపల్లిలో సోమవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి ఏడాదిగా ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంచి పెట్టారు. అనంతరం కాటూరు చేరుకొని కొత్తగా నిర్మించిన సిమెంట్ కాంక్రీట్ రోడ్డును ప్రారంభించారు. మధ్యాహ్నం పార్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఆధ్వర్యంలో బుధవారం పిచ్చాటూరు, ఎంకేటి మహల్‌లో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. జాబ్ మేళా పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు చిత్తూరు జిల్లా జట్లు ఎంపిక



**ప్రజాశక్తి - క్యాంపస్:** చిత్తూరు జిల్లా బ్యాట్మెంటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ - 15, అండర్ - 17 బాలికల, బాలుర సింగిల్స్ - డబుల్ జట్లు అలాగే మెన్, ఉమెన్ సింగల్స్, డబుల్స్ జట్ల ఎంపిక పోటీలు సోమవారం నిర్వహించారు. తిరుపతి , శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన ఈ సెలక్షన్స్‌లో ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఆనందరెడ్డి, కార్యదర్శి పి.రామకృష్ణయ్య, అధ్యక్షుడు కే.సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి సి.హెచ్.కిరణ్ కుమార్, కోశాధికారి జి.శివయ్యల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన ఈపోటీలలో గెలిచిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలియజేశారు. ఈ పోటీలలో బాలుర అండర్ - 15 సింగిల్స్ విభాగంలో విన్నర్‌గా ప్రణవ్, రన్నర్‌గా ప్రేమ్ అబినయ్, బాలికల విభాగంలో విన్నర్‌గా కీర్తన, రన్నర్‌గా మన్విత, అండర్ -17 సింగిల్స్ బాలురు విభాగంలో విన్నర్ ధీరజ్, రన్నర్‌గా కార్తీక్, బాలికల విభాగంలో విన్నర్‌గా కీర్తన, రన్నర్‌గా మన్వితలు విజయం సాధించారు. మెన్స్ సింగిల్స్ లో విన్నర్‌గా ప్రణవ్ సాయి, రన్నర్‌గా ధీరజ్, ఉమెన్ సింగల్స్ విభాగంలో విన్నర్‌గా జోత్స్న, రన్నర్‌గా సింధు నిలిచారు. బాయ్స్ అండ్ 15 డబుల్ విభాగంలో విన్నర్స్‌గా కృతికేష్, మౌనిష్, రన్నర్స్‌గా దేవాన్ష్, షాహీర్లు నిలిచారు. అండర్ 15 గర్ల్స్ డబుల్స్ విభాగంలో విన్నర్స్‌గా ఆయేష్ణ, అక్షర, రమేష్‌లు, రన్నర్స్‌గా జీవిత, సిరి చందనలు నిలిచారు. అండర్ 17 గర్ల్స్ డబుల్స్ విభాగంలో విన్నర్స్‌గా బి.సాన్వి, ఎం.యోషిత నిలిచారు. ఉమెన్స్ డబుల్స్ విభాగంలో విన్నర్స్‌గా సింధు- అఖిల సాయి, రన్నర్స్‌గా లయ-లావణ్య నిలిచారు. అండర్ 17 బాయ్స్ డబుల్స్ విభాగంలో విన్నర్స్ గా జి.కార్తీక్ - ప్రణవ్, రన్నర్స్ గా ఏ భగత్ - ఏ హరీష్ విజయం సాధించారు. మెన్స్ డబుల్ భాగంలో విన్నర్స్ గా ఎన్.సృజన్- ఎన్.అరుణ్, రన్నర్స్ గా శరత్ - మనోజ్ లు నిలిచారు.

## మిథున్ రెడ్డి అరెస్ట్ అప్రజాస్వామికం

**ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ:** ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి పై బూటకపు లిక్కర్ స్కాం పేరుతో అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేయడం అప్రజాస్వామికమని, ఇలాంటి అరెస్టులకు పెద్దిరెడ్డి కుటుంబం వెరవదని.. ఈ అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్లు వైయస్సార్సీపి సీనియర్ నాయకులు అరణి విద్యనాథరెడ్డి తెలిపారు. పిరికిపంద చర్యలను ఎదుర్కొనేందుకు పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డి సిద్ధంగా ఉన్నారని, ఆయన అడుగుజాడల్లో పార్టీ శ్రేణులు కూటమి కుట్రలను తిప్పికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.

**నేడు నిరసన..** మిథున్ రెడ్డి అక్రమ అరెస్ట్‌కు నిరసనగా సత్యవేడు ఇంచార్జ్ నూకతోటి రాజేష్, మండల అధ్యక్షులు కె.మణి నాయుడుల ఆధ్వర్యంలో ఈరోజు వైస్సార్ విగ్రహం ఆవరణలో శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించబడుతుందని వైసీపీ నాయకులు సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ, ఎంపిటీసీ సభ్యులు, సర్పంచులు, రాష్ట్ర, జిల్లా నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు, విలేకరులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయవలసినదిగా బుచ్చినాయుడు కండ్రిగ వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ మణి నాయుడు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

## ఆడుదాం ఆంధ్రపై సమగ్ర దర్యాప్తు

### త్వరలోనే మాజీ మంత్రి రోజా అరెస్ట్: రవి నాయుడు

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** మాజీ మంత్రి రోజా ప్రజాభిమానంతో గెలుపొందిన నగరి శాసనసభ్యులు గాలి భానుప్రకాష్‌పై చేసిన వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉందని, ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై సమగ్ర దర్యాప్తును జరుపుతున్నామని, ఆగస్టు 10 లోపు మాజీ మంత్రి రోజా అరెస్టు అవ్వడం ఖాయమని శాప్ చైర్మన్ రవినాయుడు స్పష్టం చేశారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో చంద్రబాబు, లోకేష్‌లపై అసభ్యంగా మాట్లాడిన రోజా, నేడు తనను ఏదో అన్నారని కల్లబొల్లి ఏడుపులు చేస్తే ప్రజలు నమ్మరన్నారు. నియోజకవర్గంలో అవినీతికి పాల్పడ్డారని, అక్రమ పద్ధతిలో ప్రజాధనాన్ని దోచుకున్న ఏ ఒక్కరిని కూటమి ప్రభుత్వం విడిచిపెట్టదని, తప్పులు చేసిన ప్రతి ఒక్కరికి జైలు శిక్ష తప్పదన్నారు. మరి ఏ తప్పులు చేయకుంటే రాష్ట్రం విడిచి ఇతర దేశాలకు వెళ్లాల్సిన అవసరాలు ఏం వచ్చాయని, ముందస్తు బెయిల్ కోసం కోర్టులలో ఎందుకు దరఖాస్తులు చేసుకుంటున్నారని రవి నాయుడు ప్రశ్నించారు. తప్పు చేశారు కాబట్టి దేశం విడిచి వెళ్లేందుకు విమానాశ్రయాలకు వెళ్తున్నారని, త్వరలోనే మాజీ మంత్రి రోజా కూడా ఏదో ఒక విమానాశ్రయంలో కనిపించి అరెస్టు అవడం జరుగుతుందన్నారు. గతంలో మాజీ మంత్రి రోజా మాట్లాడిన వ్యాఖ్యలను వీడియోల ద్వారా మీడియా ముందు రవి నాయుడు ప్రదర్శించారు. తిరుపతి నియోజకవర్గంలో దొంగ ఓట్ల సూత్రధారులను కూడా త్వరలోనే కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో అరెస్టులు చేయడం జరుగుతుందన్నారు.

# క్రైం న్యూస్

## సబ్ రిజిస్ట్రార్ ఆనంద్ రెడ్డి పై దాడికి యత్నం


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి - రేణిగుంట:** రేణిగుంట పట్టణంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయంలో సోమవారం కొందరు గుర్తుతెలియని వ్యక్తులు దాడికి యత్నం చేశారు. ఈ సందర్భంగా సబ్ రిజిస్టర్ మాట్లాడుతూ విధుల్లో ఉన్న తనపై అటెండర్ తిరుమలేష్ మరో ముగ్గురితో కలిసి దాడికి ప్రయత్నించినట్టు తెలిపారు. కుల సంఘాల పేరుతో గట్టి గట్టిగా అరుస్తూ తనపై దాడికి పాల్పడ్డారని ఆయన రేణిగుంట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

## ఎర్రచందనం స్వాధీనం.. స్మగ్లర్లు అరెస్టు




**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** శేషాచలం అటవీ పరిధి, అన్నమయ్య జిల్లా, బాలపల్లి ఫారెస్ట్ రేంజ్‌లో 9 మంది స్మగ్లర్లను అదుపులోకి తీసుకొని 16 ఎర్రచందనం దుంగలు, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. టాస్క్ ఫోర్స్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైల్వే కోడూరు సబ్ కంట్రోల్ ఆర్ఐ కృపానంద ఆధీనంలోని ఏఆర్ ఎస్ఐ ఎన్.బాలచెన్నయ్య బృందం స్థానిక ఎఫ్బీఓ సుబ్బలక్ష్మి కలిసి దేశెట్టిపల్లి ఫారెస్ట్ బీటు పరిధిలో కూంబింగ్ చేస్తూ బాలపల్లి అటవీప్రాంతం చేరుకోగా అక్కడ కొందరు వ్యక్తులు రెండు కార్లతో కనిపించారన్నారు. టాస్క్ ఫోర్స్ పోలీసులను చూడగానే పారిపోయే ప్రయత్నం చేయడంతో వెంటబడి తొమ్మిది మందిని పట్టుకున్నామన్నారు. వీరు నంద్యాల, అన్నమయ్య జిల్లాలు, కర్ణాటక రాష్ట్రానికి చెందినవారుగా గుర్తించమన్నారు. వీరు వాహనములలో లోడ్ చేసిన 16 ఎర్రచందనం దుంగలను సీజ్ చేసామన్నారు. దీనిపై టాస్క్ ఫోర్స్ తిరుపతి పోలీస్ స్టేషన్లో ఎస్సై రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని అధికారులు తెలిపారు.

## ఎర్రచందనం దుంగలు స్వాధీనం



**ప్రజాశక్తి -ఏర్పేడు :** తిరుపతి అటవీ క్షేత్రాధికారి రహస్య సమాచారం మేరకు ఆదివారం రాత్రి పాపానాయుడు పేట సెక్షన్, చెల్లూరు బీట్‌లో పాయల్ సెంటర్ వద్ద పాపా నాయుడు పేట సెక్షన్ సిబ్బంది, బేస్ క్యాంప్ సిబ్బంది కలిసి పాయల్ సెంటర్ సమాధుల దారి వద్ద నిఘా ఉంచారు. సోమవారం తెల్లవారుజామున చుట్టుపక్కల పొదల్లో తనిఖీ చేపట్టగా 5 ఎర్రచందనం దుంగలు కనుగొని స్వాధీనం చేసుకున్నారు. వీటి బరువు 157 కేజీలు ఉంటుందని, విలువ లక్ష 30 వేల రూపాయలు ఉందని బి.సుదర్శన్ రెడ్డి ఎఫ్ ఆర్ ఓ (తిరుపతి) తెలిపారు. వై శంకరప్ప ఎఫ్ఎస్ఓ, ఎం మునియా నాయక్ ఎఫ్ బి ఓ, ఆర్ జ్యోతి ఎఫ్ బి ఓ, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి దృష్టికి గిరిజన సమస్యలు

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** గిరిజన, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి దృష్టికి రాష్ట్రంలోని గిరిజనుల సమస్యలను తీసుకెళ్లినట్లు ఏపీ గిరిజన సలహా మండలి సభ్యుడు మాసారపు సుబ్బయ్య తెలిపారు. తిరుపతిలోని పద్మావతి అతిథి గృహంలో సోమవారం మంత్రి సంధ్యారాణి గిరిజన శాఖాధికారులతో సమావేశమయ్యారు. రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, భూములు, పక్కా గృహాలు, రుణాలు, మౌలిక వసతులు, పౌష్టిక ఆహారం అంశాలపై చర్చించినట్లు సుబ్బయ్య తెలిపారు.

## ముక్కంటి సేవలో హైకోర్టు జడ్జి

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి :** రాష్ట్ర హైకోర్టు జడ్జి రవినాథ్ సోమవారం కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. ఆయనకు ఆలయాధికారులు దర్శన ఏర్పాటు చేశారు. రాహుకేతు సర్ప దోష నివారణ పూజలు చేసుకున్నారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

## రైతులకు అందుబాటులో ఉండాలి : ఎమ్మెల్యే గాలి

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** రైతులకు అందుబాటులో ఉండి, వారి సమస్యలు పరిష్కరించాలని నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ సూచించారు. పుత్తూరు పరిధిలోని చెర్లోపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన పాలకవర్గం ప్రమాణస్వీకార మహోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పాల్గొన్నారు. చైర్మన్‌గా నరేందర్ రెడ్డి, డైరెక్టర్లుగా రాజేంద్ర నాయుడు, విజయ్ భాస్కర్, చేతుల మీదుగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమ కోసం అనేక పథకాలు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, చిత్తూరు పార్లమెంటరీ ఉపాధ్యక్షులు చినబాబు, మాజీ వైస్ చైర్మన్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# విభిన్న కౌశలాల సంవర్ధనకు ఏర్పాటు

**ప్రజాశక్తి - క్యాంపస్:** తిరుపతి, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో, విద్యార్థుల విభిన్న కౌశలాల సంవర్ధనానికి ఏర్పాటుచేసిన వివిధ పరిషత్తుల శుభారంభంక సోమవారం విశ్వవిద్యాలయంలోని చెలికాని అన్నారావు సభ భవన్‌లో నిర్వహించారు. విశ్వవిద్యాలయ వైస్-ఛాన్సలర్ ప్రొ.జి.ఎస్.ఆర్ కృష్ణమూర్తి ఈ పరిషత్తుల సమూద్ఘాటనం చేశారు. ప్రత్యేకించి సంస్కృత భాషలో భాషా కౌశలాన్ని సంపాదించడం కొరకు వాగ్వర్ధినీ పరిషత్, ఆంగ్ల భాషలో ప్రావీణ్య కౌశలం సంపాదించడం కొరకు మ్యాక్స్ ముల్లర్ ఇంగ్లీష్ క్లబ్, హిందీ భాషలో తులసీదాస్ హిందీ పరిషత్, తెలుగు భాషలో భాషా కౌశలాలను పెంపొందించడం కొరకు అన్నమాచార్య సాహిత్య కళాపరిషత్, సంస్కృతిక విషయాలలో ప్రావీణ్యం సంపాదించడం కొరకు శ్రీ వేమ భూపాల కళాపరిషత్, ప్రత్యేకించి శాస్త్రం అధ్యయనం చేస్తున్నటువంటి విద్యార్థులు ఆ శాస్త్రాల్లో మంచి ప్రావీణ్యాన్ని సంపాదించడం కొరకు శాస్త్రార్థ ప్రశిక్షణ సమితి మొదలగు పరిషత్తులన్నిటి ప్రారంభోత్సవం చేశారు. అనంతరం వి.సి ప్రొ.కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు ఈ పరిషత్తులను సద్వినియోగం చేసుకున్నట్లయితే వారు అన్ని భాషల్లో కూడా చక్కటి జ్ఞానాన్ని సంపాదించగలరని తెలిపారు. అదేవిధంగా సాంస్కృతిక విషయాల్లో కూడా మంచి కళా ప్రావీణ్యాన్ని సంపాదించగలరని సూచించారు. అదేవిధంగా ఉత్కర్ష మహోత్సవంలో ఈ అన్ని పరిషత్తులు కూడా వారి వారి పరిషత్ ద్వారా ఒక చక్కటి మ్యాగ్జైన్స్ ని సిద్ధం చేసి అక్కడ విశ్వవిద్యాలయ విద్యార్థుల ప్రతిభను ప్రదర్శించేలా కార్యాచరణ చేయాలని కోఆర్డినేటర్స్ కి సూచించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్ శుక్ల గౌరవ అతిథిగా విచ్చేసి ఈ పరిషత్తులు మహత్వాన్ని వర్ణించారు. ఈ కార్యక్రమం అంతటికీ కోఆర్డినేటర్గా వాగ్వర్ధీ పరిషత్ కోఆర్డినేటర్ డా.భరత్ భూషణ రథ్, డా.ప్రదీప్ కుమార్ భాగ్, అడిషనల్ కోఆర్డినేటర్ డా.ఉదయన హెగ్డే మరియు వివిధ పరిషత్తుల కోఆర్డినేటర్స్ మ్యాక్స్ ముల్లర్ ఇంగ్లీష్ క్లబ్ కోఆర్డినేటర్ ప్రొ.ఆర్.దీప్త, డా.జగన్ మోహన్, తులసీదాస్ హిందీ పరిషత్ కోఆర్డినేటర్ డా.టి. లతా మంగేష్, డా.వేద ప్రకాష్ బోర్కర్, అన్నమాచార్య సాహిత్య కళాపరిషత్ కోఆర్డినేటర్ డా.డి. నల్లన్న, డా.వై.విజయలక్ష్మి, వేమ భూపాల కళా పరిషత్ కోఆర్డినేటర్ డా.కె.లీనా చంద్ర, డా.హన్స ప్రభాకర్ రవిదాస్, శ్రీ ఆదర్శ ఎమ్.ఎ, శాస్త్రార్థ ప్రశిక్షణ సమితి కోఆర్డినేటర్ ప్రొ.కె.గణపతి భట్, అడిషనల్ కోఆర్డినేటర్ డా.నాగరాజు భట్, డా.శ్రీహరి శివరామ దాయి గుడె, మహా మహోపాధ్యాయ పట్టాభి రామశాస్త్రి వ్యాఖ్యానమాల కోఆర్డినేటర్ ప్రొ.కె.విశ్వనాథ్ పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయడం జరిగింది.




## శ్రీ కోదండరామాలయంలో శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ



**ప్రజాశక్తి - తిరుపతి సిటీ:** తిరుపతి శ్రీ కోదండరామస్వామివారి ఆలయ పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం పవిత్ర సమర్పణ శాస్త్రోక్తంగా జరిగింది. ఇందులో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి తోమాలసేవ, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం సీతాలక్ష్మణ సమేత శ్రీరాములవారి ఉత్సవర్లను యాగశాలకు వేంచేపు చేశారు. అక్కడ విష్వక్సేనారాధన, పుణ్యాహ వచనం, కుంభారాధన, ఉక్తహోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సీతాలక్ష్మణ సమేత శ్రీ కోదండరామస్వామివారి ఉత్సవమూర్తులకు స్నపనతిరుమంజనం వేడుకగా జరిగింది. ఇందులో ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకం చేశారు. అనంతరం యాగశాలలో పవిత్రమాలలకు ఉపచారాలు నిర్వహించి ప్రదక్షిణగా సన్నిధికి వేంచేపు చేశారు. ధ్రువమూర్తులు, కౌతుకమూర్తులు, స్నపనమూర్తులకు బలిమూర్తులకు పవిత్రాలు సమర్పించారు. అదే విధంగా విష్వక్సేన, ద్వారపాలకులు, భాష్యకార్లు, గరుడాళ్వార్, యాగశాలలోని హెూమగుండాలు, బలిపీఠం ధ్వజస్తంభం, ఆలయం ఎదురుగా గల ఆంజనేయ స్వామివారికి పవిత్రాలు సమర్పించారు. సాయంత్రం శ్రీ సీతారామలక్ష్మణులు బంగారు తిరుచ్చిపై ఆలయ మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం యాగశాలలో వైదిక కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



## హరిహర వీరమల్లు విజయవంతం కావాలి




**ప్రజాశక్తి - తిరుపతి సిటీ:** హరిహర వీరమల్లు సినిమా భారీ సక్సెస్ సాధిస్తుందని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. పవన్ కళ్యాణ్ సినిమా హరిహర వీరమల్లు ఘన విజయం కావాలని అలిపిరి, శ్రీవారి పాదాల వద్ద సోమవారం సాయంత్రం కొబ్బరి కాయలు కొట్టి శ్రీవేంకటేశ్వర స్వామిని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో జనసైనికులు మొక్కుకున్నారు. డిప్యూటీ సీఎంగా పవన్ కళ్యాణ్ అయ్యాక విడుదల అవుతున్న తొలి చిత్రం హరిహర వీరమల్లు అని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. ఈ సినిమా ద్వారా గొప్ప మెసేజ్ ప్రజలకు పవన్ కళ్యాణ్ ఇవ్వనున్నారని తెలిపారు. జన శ్రేణులతో పాటు మెగా ఫ్యాన్స్ సినిమా సక్సెస్ లో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. రాజకీయాల్లోకి వచ్చాక సినిమాలు తగ్గించుకున్నప్పటికి పవన్ కళ్యాణ్‌కు ఫ్యాన్స్ క్రేజ్ ఏమాత్రం తగ్గలేదన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నగర అధ్యక్షులు రాజా రెడ్డి, కార్పొరేటర్లు సీకే రేవతి, దూది కుమారి, శైలజ, యాదవ కృష్ణ, దూది శివ, ఆకేపాటి సుభాషిణి, డాక్టర్ ఆకుల వనజ తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకుంటున్న నాటక ప్రదర్శనలు




**ప్రజాశక్తి - తిరుపతి సిటీ :** టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్, భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, ఏపీ సృజనాత్మక, సాంస్కృతిక సమితి సౌజన్యంతో అభినయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో హనుమ అవార్డ్స్‌లో భాగంగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి నాటకోత్సవాలు అందర్నీ ఆకట్టుకుంటున్నాయి. స్థానిక మహతి ఆడిటోరియంలో సోమవారం ఉదయం కూచిపూడి, భరతనాట్యం, జానపద బృందం నృత్య పోటీలు నిర్వహించారు. సాయంత్రం ఖమ్మంకి చెందిన శ్రీ భక్త రామదాసు కళామండలి కళాకారులచే విష్ణువర్ధనుడు పద్య నాటకాన్ని ప్రదర్శించారు. రాత్రి 7 గంటలకు ఏలూరుకి చెందిన హేలాపురి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సారీ రాంగ్ నెంబర్ సాంఘిక నాటకాన్ని ప్రదర్శించారు. జాతీయ నాటక ఉత్సవాలు ఆహుతుల్ని ఎంతగానో ఆకట్టుకున్నాయి.

## పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

**ప్రజాశక్తి - రేణిగుంట:** రేణిగుంటలో సోమవారం దోమల నివారణకై డ్రై డే పాటించాలని ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, అలా ఉంటే రోగాలు దరి చేరకుండా ఆరోగ్యంగా ఉంటారని హెల్త్ సూపర్వైజర్ కామరాజు తెలిపారు. రేణిగుంట, బుగ్గ వీధిలో ఇంటింటికి తిరుగుతూ డ్రైడే పై అవగాహన కల్పించారు.

## తిరుమలలో ఘనంగా పల్లవోత్సవం



**ప్రజాశక్తి - తిరుమల:** మైసూరు మహారాజు జయంతిని పురస్కరించుకుని టీటీడీ పల్లవోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, బోర్డు సభ్యులు నరేష్, జంగా కృష్ణమూర్తిలు పాల్గొన్నారు. కర్ణాటక సత్రానికి ఊరేగింపుగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి ఆహ్వానం పలికి ప్రత్యేక హారతులు, ప్రత్యేక పూజలు నిర్వహించిన మైసూర్ సంస్థానం, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు టీటీడీ చైర్మన్‌ను శాలువాతో సత్కరించి, మైసూరు సంస్థాన జ్ఞాపికను అందజేశారు. అనంతరం కర్ణాటక ఎండోమెంట్ కమిషనర్ మైసూర్ సంస్థానం రాజమాత ప్రమోదాదేవి, మహారాజు యదువీర్ కృష్ణదత్త చామరాజ్ వడియార్‌లకు పట్టువస్త్రం కప్పి చైర్మన్ సత్కరించారు.

## నేడు వైసీపీ విస్తృత సమావేశం



**కోట వైసీపీ అధ్యక్షులు పలగాటి సంపత్ కుమార్ రెడ్డి**

**ప్రజాశక్తి-కోట :** 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' పేరుతో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం ఈరోజు సాయంత్రం, 4 గంటలకు కోట మండలం, విద్యానగర్‌లోని నేదురుమల్లి సుబ్బారామి రెడ్డి కళాభవన్‌లో నిర్వహిస్తున్నట్టు కోట వైసీపీ అధ్యక్షులు పలగాటి సంపత్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైసీపీ విస్తృత స్థాయి సమావేశానికి మండల ఎంపీపీలు, జడ్పీటీసీ లు వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

## మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించండి



**ప్రజాశక్తి -ఏర్పేడు :** ఏర్పేడు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు పల్లాం, పంగూరులో విద్యార్థులకు అందిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ, భోజనం నాణ్యతను పరిశీలించారు. అనంతరం పాఠశాలలకు కావలసిన మౌలిక వసతులు గురించి ఉపాధ్యాయులు నుండి ఆరాతీసి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కోరారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ:** తిరుపతి పరిధిలో గల ఆపరేషన్ ఎస్.ఎస్. సెక్షన్‌లో సి ఏమ్ డి సబ్ స్టేషన్ నందు 11 కె.వి విద్యుత్ లైన్లు మరమ్మత్తులు కోసం 22వ తేదీ పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎస్పీడీసీఎల్ తిరుపతి అర్బన్ ఈఈ చంద్రశేఖర ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎస్ టివి నగర్, న్యూ ఇందిరా నగర్, తదితర ప్రాంతల్లోవిద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.